
# టికెట్ దొరికింది

ముసునూరి పేరయ్యశాస్త్రి



ఆ రూట్లో సిటీ బస్ వచ్చి చాలా సేపయినట్టుంది. జనం ఎక్కువ మందే ఉన్నారు. పది గంటల లోపల ఆఫీసుకు వెళ్లకపోతే- తాను కలవాల్సిన మనిషికాస్త వెళ్లిపోతాడన్న ఆరాటంతో బస్ కోసం ఎదురు చూస్తున్నాడు రవి. చూపులు కన్నా ఎదురు చూపులే మిన్నన్నది ప్రియురాలికి వర్తిస్తుందే గానీ, బస్ కోసం ఎదురు చూడటంలోనే నగం జీవితం గడిపేయాల్సి వస్తున్న దానిలోని చిరాకంతా అతని ముఖంలో కనిపిస్తోంది.

పైగా గంట ప్రయాణం.

ఉదయం పూటే ఈ బస్సులు రాకపోవడమేమిటి.... ఖర్మగాలి ఎవరూ ఊహించని ఇ బంద్ గానీ ఎవరైనా ప్రకటించ లేదు గదా! ఆటోలో వెడతామంటే జేబు చిక్కిపోయి ఉంది... బస్ కోసమే ఎదురు చూడక తప్పదు....

జనంలో కదలిక....

దూరంగా బస్ వస్తున్న హెూరు....

ఈ జనవ్యూహాన్ని ఛేదించుకొని త నీ బస్ ఎక్కగలడా.... ఏమో... అంతా భగవంతుని దయ.... రవి కంగారు పడుతున్నాడు..... ఎలాగైనా ఆ బస్సెక్కాలన్న కృతనిశ్చయంతో ముందుకు కదిలాడు. బస్ వచ్చి ఆగింది. హమ్మయ్య... బస్సులో పెద్ద జనం లేరు.... ఊపిరి పీల్చుకొని నునాయానంగానే బస్సెక్కాడు రవి. కుదుపుతో బస్ బయలుదేరింది. ఇప్పుడేఎక్కినజనంతో బస్ నిండిపోయింది.

కండక్టర్ వచ్చాడు. టిక్కెట్లు ఇచ్చాడు. రూపాయి పావులా టిక్కెట్ రూపాయి ముప్పావులా టికెట్ ఒకటీ ఇచ్చాడు. ఒక చేత్తో పై కడ్డీని పట్టుకొని నిలబడి - రెండో చేతిలోని టికెట్లు జేబులో పెట్టుకోబోయాడు గానీ ఇంతలో ఊహించని నంఘటన గాలికి చేతిలో ఉన్న రెండు టికెట్లలో ఒకటి జారి క్రింద పడిపోయింది.

"అయ్యో.... టికెట్ పడిపోయింది" అనుకొంటూ చేతిలో ఉన్న టికెట్ చూసుకున్నాడు. అది రూపాయి పావలా టికెట్..... అంటే రూపాయి ముప్పావలా టికెట్ కాస్తా పడిపోయిందన్న మాట. ఉన్న ఆ టికెట్‌ను జేబులో పెట్టుకొని - పడిపోయిన టికెట్ కోసం వెదక సాగాడు. టికెట్ పడిపోయిన ప్రదేశం చూశాడు గాబట్టి అక్కడే వెదుకుతున్నాడు. సీట్లలో కూర్చున్న వాళ్ల కాళ్ల దగ్గర ఒదిగి కూర్చుని వెదికాడు. అంత మంది జనం మధ్య కూర్చుని- పడిపోయిన టికెట్ కోసం వెదకడం ఇబ్బందిగా ఉన్నా పట్టు వదలని విక్రమార్కునిలా వెదుకుతూనే ఉన్నాడు.

" ఏంటి సార్.... టికెట్ పడిపోయిందా? ఈపాటి కది గాలికి చాలా దూరమే పోయి ఉంటుంది." సానుభూతి కురిపించాడొకాయన.

అయినా రవికి ఆశ చచ్చిపోలేదు. టికెట్ కోసం వెదుకుతూనే ఉన్నాడు. టికెట్ పడిపోయిన చోటున్న సీటులో కూర్చున్న వ్యక్తి లేచి... "సీట్లో కూర్చుని వెదుక్కోండి....." అని తాను దిగాల్సిన స్టేజీ వస్తోందంటూ వెళ్లిపోయాడు.

'హమ్మయ్యా! అనుకుంటూ సీట్లో కూర్చుని ముందుకు వంగి వెదికాడు. ఫలితం లేకపోయింది. ఇక దొరకదన్న నిశ్చయానికి వచ్చేసి కడదాకా ఉన్న టికెట్‌తోనే ప్రయాణం చేసేస్తే

కక్కుర్తి పడబో దామనుకున్నాడు గానీ చెకింగ్ భయం అతన్ని ఆలోచింప చేసింది.

'అయ్యో టికెట్ తీయక తప్పదా! మనసులోనే బాధపడుతున్నాడు. టికెట్ తీయాలా వద్దా అన్న సందిగ్ధంలోంచి బయట పడలేకపోతున్నాడు. జేబులోంచి మళ్లీ డబ్బులు తీయడానికి మనసొప్పడం లేదు. టికెట్ తీయకపోతే మతిస్థిమితం లేని ప్రయాణ మవుతుంది. అలా చాలా సేపు ఆలోచించి, చివరికి టికెట్ తీయడానికే నిశ్చయించుకున్నాడు. అటుగా కండక్టర్ వచ్చాడు. విషయం చెప్పాడు. సానుభూతిగా ఒకసారి చూసి, 'మరో టికెట్ తీయండి' అన్నాడు.

'తప్పుతుందా' అనుకుంటూ డబ్బులిచ్చి టికెట్ తీసుకొని భద్రంగా జేబులో పెట్టుకున్నాడు. వృధాగా డబ్బులు పోయినందుకు బాధపడుతున్నాడు. పోయిన ఆ టికెట్టే కళ్ల ముందు మెదులు తోంది. ఆ అసంతృప్తితోనే చివరికంటా ప్రయాణం చేశాడు. దిగాల్సిన స్టేజీలో బస్ దిగాడు. టైం చూసుకున్నాడు. తొమ్మిదిన్నర.... ఫర్వాలేదనుకొని అడుగులు ముందుకు వేశాడు. హడావిడిగా నడుస్తున్న అతనికి వెనక నుండి 'ఏవండీ'! అన్న పిలుపు విని ఆగి వెనక్కి చూశాడు.

ఎవరో అపరిచిత యువకుడు.

'ఒక్క నిముషం....' అంటూ రవి దగ్గరకు వచ్చాడు. అతని చేతిలో ఏదో ఫైలుంది.

"సార్.... ఒక విషయం మీకు చెప్పాలి". అన్నాడు.

'నాతోనా' ఆశ్చర్యంగా అడిగాడు రవి.

"అవు న్సార్..... నన్ను మీరు క్షమించాలి..... మీరు పోగొట్టుకున్న టికెట్ నాకే దొరికింది. ఇదిగో సార్ టికెట్.....' అంటూ జేబులోంచి టికెట్ తీసి చూపించాడు.

రవి అతని మాటలకి ఆశ్చర్యపోయాడు. తర్వాత ముఖం ఎర్రబడింది. ఆ యువకుని పట్ల తనలో కలుగుతున్న అసహ్యాన్నంతా కళ్లల్లో నింపుకొని మరి.... అంతలా నేను వెదుక్కుంటే ఎందుకివ్వలేదు..." కోపంగా అడిగాడు.

ఆ యువకుని ముఖంలో సిగ్గు.....

"సార్..... నేను నిరుద్యోగిని. ఈ రోజు నాకు ఇంటర్వ్యూ ఉంది. నేనూ మీరెక్కిన స్టేజీలోనే బస్సెక్కాను. నా దగ్గర ఇంటి దగ్గర బయల్దేరటప్పుడు రూపాయి పావలాయే ఉంది. దానికి సరిపడా టికెట్ తీసుకున్నానండి. ఆ తర్వాతెలాని ఆలోచిస్తుండగా మీ టికెట్ పడిపోవడం గమనించాను. పడిన వెంటనే కాళ్ల కింద తొక్కిపెట్టాను. సార్! మీ టికెట్ పడిపోయినా, మీరు మరో టికెట్ తీసుకోగలిగారు. టికెట్ లేకుండా పట్టుబడితే నేను ఇంటర్వ్యూకి హాజరు కాలేను. నా అవసరం న న్నలా చేయించింది. ఇలా చేశాను గదాని నన్ను దొంగనుకోకండి సార్... కల్పించి కథలు చెబుతున్నా ననుకోకండి సార్..... నా ఇంటర్వ్యూ కార్డు ఇదిగో సార్.... నన్ను నమ్మండి... నన్ను క్షమించండి.... అంటూ రవి చేతులు పట్టుకొని బావురుమన్నాడు.

రవి కొన్ని క్షణాలు నిశ్చేష్టుడై నిలబడిపోయాడు. తర్వాత తేరుకున్నాడు. అతని కన్నీళ్లు రవిని నమ్మించాయి. అంత వరకూ అతని మీది కోపం స్థానే ఇప్పుడు జాలి చోటు చేసుకొంది 'ఫర్వాలేద'న్నట్లుగా భుజం తట్టాడు. ముఖం ప్రసన్నంగా మార్చుకొని, 'ఇంతవరకూ ఆ రూపాయి ముప్పావలా వృధాగా పోయాయని బాధపడ్డాను. ఇపుడు ఆ బాధ పోయింది. విష్ యూ ఆల్ ద బెస్ట్.....' అని ముందుకు వెళ్లబోయి ఆగి, "మరి తిరిగి ఇంటికి వెళ్లేటప్పుడు అంత దూరం ఎలా వెడతావ్?" అనుమానంగా అడిగాడు రవి.

ఆ ప్రశ్నకు తన దగ్గర జవాబులే దన్నట్లుగా చిన్నగా నవ్వా డా యువకుడు.

వెంటనే తన జేబులోంచి అయిదు రూపాయల నోటు తీసి అతని చేతిలో పెట్టి "గో అహెడ్..." అనేసి వెళ్లి పోతున్న రవిని కన్నీటి తెరల మధ్య నుంచి చూస్తూ నిలబడిపోయాడు ఆ నిరుద్యోగి..... ●




టాన్‌టెక్స్. పురుషుల కోసం.

శరీరానికి కచ్చితంగా అనువైనది. పూర్తిగా విభిన్నమైనది. దృఢమైనది. సాటిలేనిది. టాన్‌టెక్స్ అండర్‌వేర్. విజయవంతులైన పురుషులకు—మీకు

బ్రీఫ్ : వాంటేజ్. P-ఫ్రంట్. ఎకానమీ. V-లైన్. ఏన్. హగ్గర్.

వెస్ట్ : ఎక్స్‌పో. సూపర్. సూపర్ రిబ్ మరియు స్ట్రయిప్.

ఈజిప్షియన్ రిబ్ మరియు జాలీ.

టాన్‌టెక్స్®

వెస్ట్ మరియు బ్రీఫ్

ఒక్క ttk తయారీ

HTA 8208

Cyan. Black